సాక్షి గ్రేటర్ వరంగల్
(హనుమకొండ - వరంగల్)

మంగళవారం । 5 । మార్చి । 2024



మంత్రాల పెట్టె పేరుతో..
మంత్రాల పెట్టె పేరుతో అమాయకుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్న నలుగురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ దామోదర్‌రెడ్డి తెలిపారు. - 8లో▸



పరుగో..పరుగు..
జీరో బిల్లు రాని విద్యుత్ వినియోగదారులు మండల, మున్సిపల్ కార్యాలయాల వైపు పరుగులు పెడుతున్నారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
$37^0 / 23^0$

వాతావరణం
జిల్లాలో ఉదయం నుంచి పొడి వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం సమయంలో ఉష్ణోగ్రతలు మరింత పెరుగుతాయి. ఉక్కపోత అధికమవుతుంది. రాత్రి పూట చలి తగ్గుతుంది.

న్యూస్‌రీల్

కలెక్టర్‌ను కలిసిన అదనపు కలెక్టర్



హన్మకొండ అర్బన్: హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్(రెవెన్యూ)గా బాధ్యతలు చేపట్టిన వెంకట్‌రెడ్డి సోమవారం కలెక్టర్ సిక్తా పట్నాయక్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్క అందజేశారు. హనుమకొండ, పరకాల ఆర్డీఓలు వెంకటేష్, నారాయణ కూడా కలెక్టర్‌ను కలిశారు. ఈ సందర్భంగా బాధ్యతలు చేపట్టిన అధికారులకు కలెక్టర్ శుభాకాంక్షలు తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

కాజీపేట అర్బన్ : హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ బేగంపేట, రామాంతపూర్‌లో 2024–25 విద్యా సంవత్సరానికి గాను ఒకటో తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి హేమకళ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. హనుమకొండ జిల్లాలోని నిరుపేద గిరిజన విద్యార్థులు ఈనెల 11వ తేదీలోపు హనుమకొండ అంబేడ్కర్ భవన్ ఎదుట గల జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలన్నారు. ఈనెల 14న లక్కీ డ్రా నిర్వహించి ముగ్గురు బాలికలు, ముగ్గురు బాలురను ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు.

ఇంటర్ పరీక్షకు 740 మంది గైర్హాజర్

విద్యారణ్యపురి : ఇంటర్ ఫస్టియర్ పరీక్షలను హనుమకొండ జిల్లాలోని 53 పరీక్ష కేంద్రాల్లో నిర్వహిస్తున్నారు. సోమవారం జరిగిన పరీక్షలకు 740 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని డీఐఈఓ ఎ.గోపాల్ తెలిపారు. జిల్లాలో మొత్తం 21,162 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సిండగా అందులో 20,422 మంది మాత్రమే హాజరయ్యారని తెలిపారు.

ఐకామ్-24 ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్



కాజీపేట అర్బన్ : నిట్ వరంగల్‌లోని అంబేడ్కర్ లెర్నింగ్ సెంటర్ ఆడిటోరియంలో సోమవారం ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ అడిటివ్ మ్యానుఫ్యాక్చరింగ్(ఐకామ్–24)ను నిట్ మెకానికల్ ఇంజనీరింగ్ బ్రాంచ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. సింగపూర్‌లోని నాన్యాంగ్ టెక్నాలజీ యూనివర్సిటీ ప్రొఫెసర్ ఉపద్రాస్తా రామమూర్తి ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం మూడు రోజుల సదస్సును ప్రారంభించి సావనీర్ విడుదల చేశారు. ప్రొఫెసర్లు సోమశేఖర్, సురేష్‌బాబు, సీపీ.పాల్, జాస్‌ప్రీత్, సిద్ధు పాల్గొన్నారు.

విద్యాకమిషన్ ఏర్పాటు చేయాలి



విద్యారణ్యపురి : ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించేందుకు మేధావులు, విద్యావేత్తలతో కూడిన విద్యా కమిషన్ ఏర్పాటు చేయాలని డీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.లింగారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హనుమకొండలోని సంఘం కార్యాలయంలో సోమవారం నిర్వహించిన జిల్లాస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యారంగ సమస్యలు పేరుకుపోయాయన్నారు. అధ్యాపకుడు, జ్వాల సంపాదకుడు డాక్టర్ ఎం.గంగాధర్ మాట్లాడుతూ అన్ని ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. సంఘం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి సుదర్శనం తదితరులు పాల్గొన్నారు.

ఆశావహుల ఆరాటం



పార్లమెంట్ ఎన్నికల బరిలో నిలిచేందుకు పలువురి లాబీయింగ్

- వరంగల్, మానుకోట స్థానాలపై పార్టీల దృష్టి
- గెలుపే లక్ష్యంగా బలమైన అభ్యర్థుల కోసం కసరత్తు
- మహబూబాబాద్ బీఆర్‌ఎస్ అభ్యర్థి ఖరారు
- త్వరలో కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులపై క్లారిటీ
- హైదరాబాద్, ఢిల్లీలో ఆశావహుల మకాం

సాక్షిప్రతినిధి, వరంగల్ :

పార్లమెంట్ ఎన్నికల బరిలో ప్రధాన రాజకీయ పార్టీల నుంచి తలపడేందుకు ఆశావహులు ఆరాటపడుతున్నారు. హైదరాబాద్, ఢిల్లీలో మకాం వేసి ఎవరికి వారుగా ప్రయత్నాలు చేస్తున్నారు. ఇదే సమయంలో గెలుపు గుర్రాలను రంగం లోకి దింపడంపై ప్రధాన పార్టీలు దృష్టి సారించాయి. ఆ మేరకు అధిష్టానాల వడబోత చివరి దశకు చేరుకున్నట్లు చెబుతున్నారు. వరంగల్, మహబూబాబాద్ పార్లమెంట్ స్థానాలను కైవసం చేసుకోవడంపై దృష్టి పెట్టిన కాంగ్రెస్, బీఆర్‌ఎస్, బీజేపీ.. గెలుపే లక్ష్యంగా బలమైన అభ్యర్థులను బరిలోకి దింపే పనిలో ఉన్నాయి. బీఆర్‌ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ మహబూబాబాద్ అభ్యర్థిగా సిట్టింగ్ ఎంపీ మాలోతు కవితకే మళ్లీ అవకాశం ఇచ్చారు. వరంగల్ అభ్యర్థిపై ఇంకా సస్పెన్స్ కొనసాగుతోంది. తొలి జాబితా ప్రకటించిన బీజేపీ.. కాంగ్రెస్ పార్టీలు సైతం త్వరలోనే ఈ రెండు స్థానాల అభ్యర్థులపై స్పష్టత ఇచ్చే అవకాశం ఉందన్న చర్చ జరుగుతోంది.

వరంగల్ కోసం పోటాపోటీ..

వరంగల్ పార్లమెంట్ కిందకు స్టేషన్‌ఘన్‌పూర్, పాలకుర్తి, పరకాల, వరంగల్ తూర్పు, వరంగల్ పశ్చిమ, వర్ధన్నపేట, భూపాలపల్లి అసెంబ్లీ నియోజకవర్గాలు వస్తాయి. ఈ ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లు, నాలుగు జిల్లాలకు చెందిన నాయకులు వరంగల్ టికెట్ ఆశించే అవకాశం ఉంది. దీంతో అన్ని పార్టీల్లో ఆశావహుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. బీఆర్‌ఎస్ మహబూబాబాద్ అభ్యర్థిని ప్రకటించగా వరంగల్‌పై సస్పెన్స్ కొనసాగుతోంది. వరంగల్ అభ్యర్థి ఎంపిక అధిష్టానానికి తలనొప్పిగా మారింది. వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే, పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు అరూరి రమేష్ సీనియర్‌గా తనకు అవకాశం ఇవ్వాలని కోరుతుండగా.. స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి.. తన కూతురు కడియం కావ్యకు ఇవ్వాలంటున్నట్లు ప్రచారం. హనుమకొండ జెడ్పీ చైర్మన్, బీఆర్‌ఎస్ సీనియర్ నేత డాక్టర్ మారేపల్లి సుధీర్‌కుమార్ కూడా గట్టిగా పట్టుపడుతున్నారు. కేయూ ఉద్యమ నాయకులు జోరిక రమేష్, వీరేందర్, బోడ డిన్న, బండి రజని సోమవారం ప్రెస్‌మీట్ పెట్టి నలుగురిలో ఒకరికి వరంగల్ టికెట్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ నుంచి ముగ్గురి పేర్లు ఇప్పటికే అధిష్టానానికి పంపారన్న ప్రచారం ఉంది. ఆ పార్టీ నుంచి అద్దంకి దయాకర్, డాక్టర్ రామగళ్ల పరమేశ్వర్, దొమ్మాటి సాంబయ్య, హరికోట్ల రవి, నమిండ్ల శ్రీనివాస్, సింగాపురం ఇందిర, డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణతో పాటు పలువురు ఎవరికి వారుగా ప్రయత్నాలు చేస్తున్నారు. బీజేపీ నుంచి మాజీ ఐపీఎస్ అధికారి, రిటైర్డు డీజీపీ కృష్ణప్రసాద్, మంద కృష్ణమాదిగ, మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్, బొజ్జపల్లి సుభాష్ పేర్లు వినిపిస్తున్నాయి. అయితే బీఆర్‌ఎస్‌కు చెందిన మాజీ ఎమ్మెల్యే పార్టీలో చేరితే ఆయనకే చాన్స్ దక్కనున్నట్లు సమాచారం.

మానుకోట కోసం మహామహులు..

బీఆర్‌ఎస్ మహబూబాబాద్ ఎంపీ అభ్యర్థిగా మళ్లీ మాలోతు కవితకే ఆ పార్టీ అవకాశం ఇవ్వగా.. కాంగ్రెస్, బీజేపీల నుంచి ఆశావహులు ముమ్మర ప్రయత్నం చేస్తున్నారు. మానుకోట ఎస్టీ రిజర్వుడ్ సీటు కోసం కాంగ్రెస్‌లో గట్టి పోటీ నెలకొంది. స్వరాష్ట్ర ఆవిర్భావం అనంతరం దశాబ్ద కాలం తర్వాత అధికారం చేపట్టిన తెలంగాణ కాంగ్రెస్‌లో మహబూబాబాద్ ఎంపీ టికెట్ దక్కించుకుంటే చాలు.. విజయం ఖాయమన్న సంకేతాలతో ఆశావహులు భారీ స్థాయిలో దరఖాస్తు చేసుకున్నారు. అయితే కేంద్ర మాజీ మంత్రి పోరిక బలరాంనాయక్ పేరు ప్రధానంగా వినిపిస్తుండగా.. ఆదివాసీ కాంగ్రెస్ జాతీయ వైస్ చైర్మన్ తేజావత్ బెల్లయ్యనాయక్, పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ రిజిస్ట్రార్ భట్టు రమేష్, రిటైర్డ్ ఎక్సైజ్ అధికారి బానోత్ మోహన్‌లాల్, ఐపీఎస్ అధికారి నాగరాజునాయక్, డాక్టర్ శంకర్‌నాయక్, లకావత్ లక్ష్మీనారాయణనాయక్ తదితరుల పేర్లు పరిశీలనలో ఉన్నట్లు ప్రచారం చేసుకుంటున్నారు. ఇక బీజేపీ నుంచి జాటోతు హుస్సేన్‌నాయక్, కృష్ణవేణి నాయక్ పేర్లు ప్రధానంగా వినిపిస్తుండగా.. మరో ఆరుగురు మహబూబాబాద్ సీటు కోసం దరఖాస్తు చేసుకున్నారు. బీఆర్‌ఎస్ ఇప్పటికే మహబూబాబాద్ అభ్యర్థిని ప్రకటించగా, త్వరలోనే కాంగ్రెస్, బీజేపీలు అభ్యర్థులను ఖరారు చేసే అవకాశాలున్నట్లు తెలుస్తోంది.

కవితకే మళ్లీ మానుకోట టికెట్

ఎంపీ అభ్యర్థిని ప్రకటించిన బీఆర్‌ఎస్

సాక్షి,మహబూబాబాద్: త్వరలో జరగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో మానుకోట నుంచి సిట్టింగ్ ఎంపీ మాలోత్ కవితను బీఆర్‌ఎస్ మరోసారి బరిలోకి దింపుతోంది. ఈ మేరకు ఆ పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ సోమవారం ప్రకటించారు. డోర్నకల్ సీనియర్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే ధరంసోత్ రెడ్యానాయక్ కుమార్తె మాలోత్ కవిత. తండ్రి రాజకీయ వారసత్వాన్ని అందిపుచ్చుకున్న ఆమె 2009లో మహబూబాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థిగా కాంగ్రెస్ నుంచి పోటీ చేసి గెలుపొందారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన తర్వాత 2014లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి ఆమె ఎమ్మెల్యేగా పోటీ చేసి బీఆర్‌ఎస్(అప్పటి టీఆర్‌ఎస్) అభ్యర్థి శంకర్ నాయక్ చేతిలో ఓటమి పాలయ్యారు. తర్వాత జరిగిన రాజకీయ పరిణామాల్లో భాగంగా బీఆర్‌ఎస్‌లో చేరిన కవిత 2019 జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో మహబూబాబాద్ అభ్యర్థిగా పోటీ చేసి కేంద్ర మాజీ మంత్రి బలరాంనాయక్‌పై విజయం సాధించారు.



స్మార్ట్ సిటీ పనులకు బోర్డు ఆమోదం

వర్చువల్ సమావేశానికి హాజరైన ఉన్నతాధికారులు



సీఈఓ, వరంగల్ కలెక్టర్, గ్రేటర్ ఇన్‌చార్జ్ కమిషనర్ ప్రావీణ్య అధికారులు

వరంగల్ అర్బన్ : వరంగల్ మహానగరంలో స్మార్ట్ సిటీ కార్పొరేషన్ లిమిటెడ్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న 13 అభివృద్ధి పనుల కొనసాగింపునకు బోర్డు ఆమోద ముద్ర వేసింది. సోమవారం వర్చువల్ విధానంలో నిర్వహించిన 26వ స్మార్ట్ సిటీ బోర్డు సమావేశంలో హైదరాబాద్ నుంచి జీడబ్ల్యూఎంసీ ఎస్‌సీసీఎల్ చైర్మన్ అండ్ రాష్ట్ర ఎంయూఏడీ సెక్రటరీ దాన కిషోర్, బోర్డ్ సభ్యులు సీడీఎం ఎ.దివ్య దేవరాజన్, వరంగల్ నుంచి గ్రేటర్ వరంగల్ మేయర్ గుండు సుధారాణి, హనుమకొండ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్, వరంగల్ కలెక్టర్, ఇన్‌చార్జ్ కమిషనర్, సీఈఓ ప్రావీణ్య, బోర్డ్ సభ్యులు 'కుడా' వీసీ, జనగామ కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా, హనుమకొండ అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్మార్ట్ సిటీ సీఈఓ ప్రావీణ్య.. స్మార్ట్ సిటీ పథకంలో భాగంగా గత ఏజెండాలో ఆమోదం పొంది కొనసాగుతున్న బయోమైనింగ్, స్మార్ట్ సిటీ ఫేజ్– 1, 2 పనులు, నాలాల పునరుద్ధరణ, రిటైనింగ్ వాల్స్ నిర్మాణం, కరీమాబాద్ దసరా రోడ్డు, గవిచర్ల రోడ్డు, వడ్డేపల్లి బండ్, భద్రకాళి బండ్, ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ తదితర 13 పనులపై చర్చించారు. ఈ పనుల గడువును ఈ ఏడాది జూన్ వరకు పొడిగిస్తూ బోర్డు ఆమోదించినట్లు ప్రకటించారు. అంతేకాకుండా జీడబ్ల్యూఎంసీ ద్వారా గతంలో మంజూరైన ఐదు అభివృద్ధి పనుల స్థానంలో ఇతర పనులను ప్రతిపాదిస్తున్నట్లు వెల్లడించారు. ఈ నేపథ్యంలో అభివృద్ధి పనులపై బోర్డు ఎండీ వివరించారు. సమావేశంలో 'కుడా' సీపీఓ అజిత్‌రెడ్డి, బల్దియా ఎస్ఈ ప్రవీణ్‌చంద్ర, ఈఈ భీమ్‌రావు, శ్రీనివాస్‌రావు, స్మార్ట్ సిటీ పీఎంసీ ఆనంద్ ఓలేటి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు సత్వరమే పరిష్కరించాలి



వినతులు స్వీకరిస్తున్న ట్రెయినీ కలెక్టర్ శుక్లా



దరఖాస్తులు స్వీకరిస్తున్న ఏసీ సంధ్యారాణి

హనుమకొండ ట్రెయినీ కలెక్టర్ శ్రద్ధా శుక్లా

హన్మకొండ అర్బన్ : ప్రజావాణిలో వివిధ రకాల సమస్యలపై ప్రజల నుంచి స్వీకరించిన వినతులను సత్వరమే పరిష్కరించాలని హనుమకొండ ట్రెయినీ కలెక్టర్ శ్రద్ధా శుక్లా ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆమె వినతులు స్వీకరించారు. కాజీపేట తహసీల్దార్ పరిధిలో 21, కలెక్టరేట్ డి–సెక్షన్ 18, హసన్‌పర్తి తహసీల్దార్ 14, ధర్మసాగర్ తహసీల్దార్ 13, హనుమకొండ తహసీల్దార్‌హ 10.. మొత్తం 207 అర్జీలు వచ్చాయి. ఈ సందర్భంగా ట్రెయినీ కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజావాణి వినతుల విషయంలో ఆయా శాఖల అధికారులు అశ్రద్ధ చేయొద్దని సమస్యలపై సత్వరమే చర్యలు తీసుకొని పరిష్కరించాలని చెప్పారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, డీఆర్‌ఓ వై.వి.గణేష్, వివిధ శాఖల ఉన్నతాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అర్జీలు సకాలంలో పరిష్కరించండి : వరంగల్ అదనపు కలెక్టర్ సంధ్యారాణి

కరీమాబాద్: ప్రజావాణిలో వచ్చే అర్జీలను సకాలంలో పరిష్కరించాలని వరంగల్ అదనపు కలెక్టర్ జి.సంధ్యారాణి అన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి వినతులు స్వీకరించి మాట్లాడారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేసేందుకు అధికారులు కృషి చేయాలని సూచించారు. ప్రజావాణి దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలని చెప్పారు. సీఎం పేషి(హైదరాబాద్) ప్రజావాణిలో జిల్లాకు సంబంధించిన అర్జీలను ఆయా శాఖల అధికారులకు ఆన్‌లైన్‌లో పంపిస్తామని, వాటిని పరిశీలించి నివేదికలు అందజేయాలని ఆదేశించారు. నర్సంపేట ఆర్డీఓ కృష్ణవేణి, డీఆర్డీఓ కౌసల్యాదేవి, అధికారులు పాల్గొన్నారు. ప్రజావాణికి మొత్తం 148 దరఖాస్తులు రాగా.. వాటిలో 114 రెవెన్యూ శాఖకు సంబంధించినవి ఉన్నాయి.

పరిధి దాటి పనులు

- టీఎస్ ఎన్పీడీసీఎల్‌లో నిధులు దుర్వినియోగం
- ఏడేళ్ల క్రితం టవర్లు నిర్మించి వదిలేశారు
- వినియోగంలోకి తేకపోవడంతో రూ.35 లక్షల ప్రజాధనం వృథా
- విచారణ చేపట్టినా చర్యలు శూన్యం



తుప్పపడుతున్న టవర్లు, పక్కన వినియోగంలో ఉన్న మరో రెండు విద్యుత్ లైన్లు

హన్మకొండ: టీఎస్ ఎన్పీడీసీఎల్‌లో నిధుల దుర్వినియోగం కొనసాగుతోంది. పర్సంటేజీలు, కమీషన్ల కక్కుర్తితో కొందరు అధి కారులు కాంట్రాక్టర్లకు కొమ్ముకాస్తూ సొంత సంస్థకు కన్నం వేస్తున్నారు. హనుమకొండ రూరల్ డివిజన్ పరిధిలో అవసరం లేకున్నా జనగామ డివిజన్ పరిధి అధికారుల పర్యవేక్షణలో విద్యుత్ లైన్ వేయడం ఇందుకు నిదర్శనంగా చెప్పుకోవచ్చు. వివరాలిలా ఉన్నాయి.. హనుమకొండ రూరల్ డివిజన్ పరిధి హసన్‌పర్తి మండలం నిరూప్‌నగర్ నుంచి మధుతండాకు వెళ్లే దారిలో అప్పటికే ఉన్న పాత విద్యుత్ లైన్ తొలగించి కొత్తది వేయాలని 2015 సెప్టెంబర్‌లో నిర్ణయించి రూ.35 లక్షలు అవుతుందని ఎస్టిమేషన్ తయారు చేశారు. 2017లో జనగామ డివిజన్ అధికారుల పర్యవేక్షణలో పనులు మొదలు పెట్టే వరకు హనుమకొండ రూరల్ డివిజన్ అధికారులకు తెలియదు. తెలిసిన తర్వాత ఇక్కడ అవసరం లేకున్నా విద్యుత్ లైన్ వేస్తున్నారని అప్పటి అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్, డివిజనల్ ఇంజనీర్ అదే ఏడాది మార్చిలో ఉన్నతాధికారులకు లేఖ రాశారు. అయినా పనులు కొనసాగించడంతో కొత్తగా లైన్ వేయాల్సిన అవసరం లేదని అభ్యంతరాలు వచ్చాయి. ఈ క్రమంలో 2016లో ఒక రోజు(పాత తేదీతో)లో 400 ఆంప్స్ లోడ్ ఉన్నట్లు(ఇతర ఫీడర్ల ద్వారా జరిగే సరఫరాను మళ్లించి) చూపించారు. విద్యుత్ లైన్ వేసే ముందు జనగామ డివిజన్ అధికారులు రెండు కిలోమీటర్లు కొత్త లైన్ సర్వే చేసి కిలోమీటరున్నరకు మాత్రమే ఎస్టిమేషన్ వేశారు. అందులో పాత లైన్ తొలగిస్తున్నట్లు పేర్కొన్నా.. తొలగించలేదు. కొత్తగా వేసిన 10 టవర్లు, మధ్యన 11 మీటర్ల ఎత్తు స్తంభాలను వినియోగంలోకి తేకపోవడంతో అవి తుప్పుపట్టిపోతున్నాయి. ఈ టవర్ల లైన్ పక్కనే మరో రెండు విద్యుత్ లైన్లు కూడా ఉండడం గమనార్హం.

విచారణ చేపట్టినా.. చర్యలు శూన్యం

ఈ విద్యుత్ లైన్ నిర్మాణ పనులపై ఫిర్యాదులు వెల్లువెత్తడంతో యాజమాన్యం ఆదేశాల మేరకు అప్పటి సీజీఎం నగేష్ ప్రాథమిక విచారణ చేపట్టి నివేదిక ఇచ్చారు. అనంతరం అప్పటి ప్రాజెక్టు డైరెక్టర్ మోహన్‌రెడ్డి పూర్తి స్థాయి విచారణ చేపట్టారు. ఇప్పటి వరకు చర్యలు శూన్యం. అసోసియేషన్ల సహాయంతో అక్రమార్కులు యాజమాన్యాన్ని మేనేజ్ చేశారనే ఆరోపణలున్నాయి. పైగా గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఆ అధికారికి ఉత్తమ ఉద్యోగిగా ప్రశంసపత్రం అందించడం చర్చనీయాంశమైంది. గత పాలకవర్గం హయాంలో మరుగునపడిన అక్రమాలు చైర్మన్, మేనేజింగ్ డైరక్టర్(సీఎండీ) మార్పుతో వెలుగులోకి వస్తున్నాయి.

కాంగ్రెస్‌లోకి పరకాల మున్సిపల్ చైర్‌పర్సన్

- మరో ఏడుగురు బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు
- తొమ్మిదికి చేరిన కాంగ్రెస్ బలం
- వైస్ చైర్మన్‌పై రేపో.. మాపో అవిశ్వాసం

పరకాల: పరకాల మున్సిపల్ చైర్‌పర్సన్ సోదా అనిత రామకృష్ణతో పాటు మరో ఏడుగురు బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం గాంధీభవన్‌లో కాంగ్రెస్ తెలంగాణ ఇన్‌చార్జ్ దేవాన్ష్ మున్షీ సమక్షంలో పార్టీలో చేరారు. ప్రస్తుతం పరకాల మున్సిపల్ పరిధిలో బీఆర్‌ఎస్–17, బీజేపీ–4, కాంగ్రెస్–1 మొత్తం 22 మంది కౌన్సిలర్లు ఉన్నారు. ఈ చేరికతో కాంగ్రెస్ బలం తొమ్మిదికి చేరింది. అయితే కొంత కాలంగా బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు కాంగ్రెస్‌లో చేరనున్నట్లు జరుగుతున్న ప్రచారం చివరకు నిజమైంది. మరో ఇద్దరు బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు కాంగ్రెస్‌లో చేరటానికి సందిగ్ధంగా ఉండగా.. బీజేపీ కౌన్సిలర్ల నుంచి ఎలాంటి స్పందన లేదు.

వైస్ చైర్మన్ రేగూరిపై అవిశ్వాసం..!

మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ప్రధాన అనుచరుడుగా పేరున్న పరకాల మున్సిపల్ వైస్ చైర్మన్ రేగూరి విజయపాల్‌రెడ్డిపై అవిశ్వాసం పెట్టేందుకు కాంగ్రెస్ సభ్యులు చాలా రోజులుగా ప్రయత్నిస్తున్నారు. అయితే మెజార్టీ లేకపోవడంతో వెనకడుగు వేయగా ప్రస్తుత చేరికలతో అవిశ్వాసం నెగ్గడం సులువని భావిస్తున్నారు. మరో ఇద్దరు బీఆర్‌ఎస్ కౌన్సిలర్లను లాగడంతో పాటు బీజేపీ కౌన్సిలర్ల సహకారం తీసుకునేందుకు హైదరాబాద్ నుంచి పరకాలకు చేరకముందే ఓ హోటల్‌లో చర్చించినట్లు సమాచారం. రెండురోజుల్లో అవిశ్వాస తీర్మానం పెట్టేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిసింది.

మహాశివరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు



ఉత్సవాల ఏర్పాట్లను పరిశీలిస్తున్న వివిధ శాఖల అధికారులు

హన్మకొండ కల్చరల్ : మహాశివరాత్రిని పురస్కరించుకొని వేయిస్తంభాల దేవాలయంలో ఈనెల 7 నుంచి 11వ తేదీ వరకు జరిగే ఉత్సవాలకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నామని ఈఓ కె.వెంకటయ్య తెలిపారు. వివిధ శాఖల అధికారుల సమన్వయంతో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా తగిన చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. సోమవారం దేవాలయాన్ని ట్రెయినీ ఐపీఎస్ అధికారి శుభం ప్రసాద్, ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ, హనుమకొండ ఏసీపీ దేవేందర్‌రెడ్డి, సీఐ సతీష్, ట్రాఫిక్ సీఐ సీతారెడ్డి, ఆర్‌అండ్‌బీ ఏఈ ఉదయ్, పురావస్తుశాఖ డీఈ చంద్రకాంత్ తదితరులు సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. ఈఓ తోపాటు ప్రధానార్చకులు గంగు ఉపేంద్రశర్మకు పలు సూచనలు చేశారు. ఏసీపీ దేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ ఐదు రోజులు జరిగే ఈ ఉత్సవాలకు 200 మంది పోలీస్ సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు. తూర్పు ద్వారం నుంచి వీఐపీలకు, ఉత్తర ద్వారం నుంచి అభిషేకం, ప్రత్యేక దర్శనం, ధర్మదర్శనం క్యూలైన్లు ఏర్పాటు చేయాలని ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ సూచించారు. కార్యక్రమంలో కేంద్ర పురావస్తు శాఖ సూపరింటెండెంట్ స్మిత ఎస్.కుమార్, జిల్లా అధికారి మల్లేషం, కొఆర్డినేటర్ నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణలు అరికట్టండి

- అధికారులు పట్టించుకోవట్లేదు
- ఇంతేజార్ గంజ్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు

రామన్నపేట: దేశాయిపేట వడ్డేపల్లి చెరువు భూమిలో కొంత మంది అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని సోమవారం ఇంతేజార్‌గంజ్ పోలీసులకు జన్ను నూతన్ ఫిర్యాదు చేశారు. ఈ అక్రమ నిర్మాణాలపై అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. ఆక్రమణలపై కలెక్టర్‌తోపాటు వరంగల్ ఆర్డీఓ వాసుచంద్ర, ఇరిగేషన్ వరంగల్ సూపరింటెండెంట్ హర్షవర్ధన్, జీడబ్ల్యూఎంసీ అదనపు కమిషనర్ రాధిక గుప్తా, కాశిబుగ్గ సర్కిల్ డిప్యూటీ కమిషనర్, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ అనిల్, ఇతర ప్రభుత్వాధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోలేదని పేర్కొన్నారు. ఆ భూములకు వారసులమైన తమకు న్యాయం చేయాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఆక్రమణదారులపై ఫిర్యాదు : ఇన్‌స్పెక్టర్

జన్ను నూతన్ అనే వ్యక్తి ప్రభుత్వానికి చెందిన భూమి ఆక్రమణకు గురవుతోందని బాధ్యులపై చర్యలు తీసుకోవాలని స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఇంతేజార్‌గంజ్ ఇన్‌స్పెక్టర్ పవన్ తెలిపారు. ఆ దరఖాస్తును వరంగల్ కలెక్టర్, ఇతర అధికారులపై ఫిర్యాదు చేస్తున్నట్లు సోషల్ మీడియాలో వస్తున్న వార్తలు అవాస్తవమన్నారు.

పోటెత్తిన మిర్చి











వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌కు సోమవారం మిర్చి పోటెత్తింది. వివిధ ప్రాంతాల నుంచి రైతులు సుమారు లక్ష బస్తాల మిర్చి అమ్మకానికి తీసుకువచ్చారు. కొనుగోళ్లు ఆలస్యం కావడంతో రైతన్నలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

- సాక్షి, స్టాఫ్ ఫొటోగ్రాఫర్, వరంగల్

క్లుప్తంగా

పలువురు ఏసీపీల బదిలీ

వరంగల్ క్రైం: రాష్ట్ర వ్యాప్తంగా ఏసీపీలను బదిలీ చేస్తూ డీజీపీ రవిగుప్తా సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. అందులో భాగంగా వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ముగ్గురు ఏసీపీలు బదిలీ అయ్యారు. సతీష్‌బాబు డీజీపీ కార్యాలయం నుంచి వరంగల్ పీటీసీ, ప్రసన్న కుమార్ వరంగల్ పీటీసీ నుంచి సైబరాబాద్ ఉమెన్ అండ్ చైల్డ్ సేఫ్టీ వింగ్, యాదగిరి డీజీపీ కార్యాలయం నుంచి సీసీఎస్ వరంగల్‌కు బదిలీ అయ్యారు.

కేయూలో పార్ట్‌టైం అధ్యాపకుల ధర్నా

కేయూ క్యాంపస్: తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ పార్ట్‌టైం అధ్యాపకుల సంఘం ఆధ్వర్యంలో ఆయా అధ్యాపకులు సోమవారం సైతం ఆందోళన చేపట్టారు. పరిపాలనభవనం వద్ద బైటాయించి ధర్నా చేశారు. 16 పీరియడ్‌లు కలిగిన పార్ట్‌టైం అధ్యాపకులను కాంట్రాక్టు అధ్యాపకులుగా కన్వర్షన్ చేయాలని ,మిగతా పార్ట్‌టైం అధ్యాపకులకు పీరియడ్‌కు రూ.700 నుంచి రూ. వెయ్యి వరకు వేతనం పెంపుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఆందోళన కొనసాగించారు. ఈ విషయం తెలుసుకున్న కేయూ వీసీ రమేష్ ఘటనా స్థలికి చేరుకుని అధ్యాపకులతో మాట్లాడారు. పార్ట్‌టైం అధ్యాపకుల సమస్యలు తనకు తెలుసని, ప్రభుత్వం అనుమతిస్తే తాను పరిష్కరించేందుకు సిద్ధమని హామీ ఇచ్చారు. దీంతో పార్ట్‌టైం అధ్యాపకులు ఆందోళన విరమించారు. కాగా, సోమవారానికి తమ ఆందోళన విరమిస్తున్నట్లు కేయూ పార్ట్‌టైం అధ్యాపకుల సంఘం అధ్యక్షుడు వై రాంబాబు తెలిపారు. కార్యక్రమంలో సంఘం జనరల్ సెక్రటరీ నరేందర్‌నాయక్, బాధ్యులు దేవోజీ నాయక్, భాగ్యమ్మ, తిరుణహరిశేషు, ఇ రమేష్, కె లక్ష్మినారాయణ, మాధవి, రమాదేవి, నవీన్, సదానందం, నాయిని వినీత ,భిక్షపతి, సరితజ్యోత్స్న, సంజీవ్, హరికుమార్, రవీందర్‌రెడ్డి, శ్రీధర్‌సాయి పాల్గొన్నారు.

అటవీ ప్రాంతంపై ఎగిరిన విమానం

మహాముత్తారం: మావోల ఏరివేతకు పోలీస్ శాఖ పూర్తిస్థాయి సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటోంది. సోమవారం భూపాలపల్లి జిల్లా మహాముత్తారం మండలం కనుకునూర్, రెడ్డిపల్లి, బోర్లగూడెం అటవీ ప్రాంతాల్లో తక్కువ ఎత్తునుంచి మినీ విమానం చక్కర్లు కొట్టింది. దీంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయమై పోలీస్ ఉన్నతాధికారిని వివరణ కోరగా ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం పోలీస్ ట్రైనింగ్ సెంటర్‌కు సంబంధించిన విమానమని పేర్కొన్నారు.

పరుగో.. పరుగు

విద్యుత్ జీరో బిల్లు రాలేదని ఆఫీస్‌ల బాట పట్టిన వినియోగదారులు

- గృహాలకు 200 యూనిట్లు ఉచితం
- కొనసాగుతున్న బిల్లుల జారీ ప్రక్రియ
- ఉమ్మడి వరంగల్ జిల్లాలో మొత్తం 12,03,156 మంది గృహ వినియోగదారులు



బల్దియాలో బారులుదీరిన లబ్ధిదారులు

హన్మకొండ: జీరో బిల్లు రాని విద్యుత్ వినియోగదారులు మండల, మున్సిపల్ కార్యాలయాల వైపు పరుగులు పెడుతున్నారు. గృహజ్యోతి పథకంలో భాగంగా తెల్ల రేషన్ కార్డు కలిగిన వినియోగదారులకు 200 యూనిట్ల లోపు ఉచిత విద్యుత్ అందించనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఇందులో భాగంగా ఈ నెల 1వ తేదీ నుంచి విద్యుత్ సంస్థ జీరో బిల్లుల జారీ చేపట్టింది. గత నెలలో బిల్లుల జారీ చేసిన క్రమంలో వినియోగదారుల తెల్లరేషన్, ఆధార్ కార్డుల నంబర్లను విద్యుత్ సర్వీస్ నంబర్‌తో అనుసంధానం చేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో మొత్తం 12,03,156 గృహ విద్యుత్ వినియోగదారులున్నారు. ఈ క్రమంలో గత నెలలో 4,25,300 మంది వినియోగదారుల సర్వీస్ నంబర్లకు తెల్ల రేషన్, ఆధార్ కార్డుల నంబర్లను అనుసంధానం చేశారు. వీరిలో 200 యూనిట్లలోపు విద్యుత్ వినియోగించిన వినియోగదారులకు జీరో బిల్లు జారీ చేస్తున్నారు. సోమవారం నాటికి ఉమ్మడి వరంగల్ జిల్లాలో 51,035 మందికి జీరో బిల్లులు జారీ చేశారు. అయితే జీరో బిల్లు రాని, తెల్ల రేషన్ కార్డు కలిగిన వినియోగదారులు తమ వివరాలు నమోదు చేసుకునేందుకు ప్రభుత్వం అనుమతించింది. తెల్లరేషన్, ఆధార్ కార్డుల నంబర్లు, ఫోన్ నంబర్, విద్యుత్ సర్వీస్ కనెక్షన్ నంబర్ వివరాలతో కూడిన ప్రజాపాలన దరఖాస్తును గ్రామీణ ప్రాంతాల్లో మండల ప్రజా పరిషత్ కార్యాలయం, పట్టణాలు, నగరాల్లో మున్సిపల్ కార్యాలయాల్లో అందించాల్సి ఉంటుంది. వీరి వివరాలను ఆయా కార్యాలయాలు రాష్ట్ర ప్రభుత్వానికి పంపుతాయి. కాగా, 200 యూనిట్ల తర్వాత ఒక్క యూనిట్ అధికంగా వినియోగించినా వినియోగదారుడు మొత్తం బిల్లు చెల్లించాలి. 200 వరకు మాత్రమే జీరో బిల్లు వస్తుంది. 201 నుంచి జీరో బిల్లు రాదు. ఒక్క యూనిట్ అదనంగా విద్యుత్ వాడినా మొత్తం యూనిట్లకు బిల్లు చెల్లించాలి.

వినియోగదారుల వివరాలు..

జిల్లా	మొత్తం వినియోగదారులు	మొదటి విడత వర్తించే వినియోగదారులు	ఇప్పటి వరకు జీరో బిల్లుల జారీ
హనుమకొండ	3,45,302	92,763	12,192
వరంగల్	2,86,156	95,483	9,934
భూపాలపల్లి, ములుగు	93,257	75,816	7793
జనగామ	1,69,375	74,575	13,616
మహబూబాబాద్	2,09,066	86,663	7500

సీకేఎంలో ఉమెన్స్ డే సెలబ్రేషన్స్



వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు

వరంగల్: దేశాయిపేటలోని సీకేఎం ప్రభుత్వ కళాశాలలో సోమవారం లైబ్రరీ, ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్ ఆధ్వర్యంలో ఉమెన్స్ డే సెలబ్రేషన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ జి.శోధర్‌రావు మాట్లాడుతూ ప్రతికూల ఘటనలు ఎదురైనప్పుడు కృంగిపోకుండా ఆ సమయంలో చదివే పుస్తకం, వినే సంగీతం, చూసే దృశ్యం ధైర్యం ఇస్తాయన్నారు. ఎన్ని సమస్యలు ఎదురైనా ఎదుర్కొని నిలదొక్కుకోవాలన్నారు. అంతేగాని ఆత్మహత్యలకు పాల్పడొద్దన్నారు. అనంతరం వివిధ విభాగాలకు చెందిన విద్యార్థులు సమాజంలో మహిళలపై జరిగే ఆకృత్యాలను మాటలు, పాటలు, కవితల రూపంలో వివరించారు. ఈ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు కళాశాల తరఫున సర్టిఫికెట్స్ అందజేశారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ ధర్మారెడ్డి, ఆర్గనైజర్స్ లైబ్రరీ అనిల్, సుమలత, మోహన్, కుమార్, కెప్టెన్ సతీష్, రమేష్, రవి తదితరులు పాల్గొన్నారు.

నేడు అయోధ్యకు ప్రత్యేక రైలు



కాజీపేట రూరల్ : కాజీపేట జంక్షన్ నుంచి నేడు (మంగళవారం) కాజీపేట–అయోధ్య(ఆస్థా)కు ప్రత్యేక రైలును నడిపిస్తున్నట్లు రైల్వే అధికారులు సోమవారం తెలిపారు. కాజీపేట జంక్షన్ నుంచి సాయంత్రం 6:20 గంటలకు ఈ రైలు బయలుదేరి అయోధ్యకు వెళ్తుందన్నారు. రామమందిరం సందర్శన కోసం ఈ రైలుకు ముందే రిజర్వేషన్ బుకింగ్ చేసుకున్న వారు మాత్రమే ప్రయాణం చేస్తారని, కాజీపేట జంక్షన్‌లో టికెట్ బుకింగ్ కౌంటర్‌లో ఈ రైలుకు టికెట్ ఇవ్వరని వారు తెలిపారు.

మారథాన్ మాణిక్యాలు..

- ప్రపంచ పరుగు పోటీల్లో రాణిస్తున్న డాక్టర్ దంపతులు



మెడల్స్‌తో తులసి, సుధాకర్

హన్మకొండ: హనుమకొండకు చెందిన డాక్టర్ దంపతులు సుధాకర్, తులసి వరల్డ్ మారథాన్(పరుగు) పోటీల్లో రాణిస్తున్నారు. ఒక పక్క వృత్తి (డెంటల్) కొనసాగిస్తూనే మరో పక్క వివిధ దేశాల్లో నిర్వహించే పోటీల్లో పాల్గొంటూ పతకాలు సాధిస్తున్నారు. ఈ క్రమంలో ఈ నెల 3న జపాన్ రాజధాని టోక్యోలో జరిగిన వరల్డ్ మారథాన్ పోటీల్లో పాల్గొని 42.4 కిలో మీటర్ల పరుగును పూర్తి చేసి స్టార్ సిక్స్ ఫినిషర్స్‌గా నిలిచారు. ఇంతకు ముందు బోస్టన్, లండన్, చికాగో, న్యూయార్క్ నగరాల్లో నిర్వహించిన మారథాన్ పోటీల్లో పాల్గొని విజయవంతంగా పరుగును పూర్తి చేశారు.

ఆర్టీసీ దసరా లక్కీ డ్రా విజేతల ఎంపిక



లక్కీ డ్రా తీస్తున్న ప్రయాణికురాలు, చిత్రంలో ఆర్ఎం శ్రీలత

హన్మకొండ: దసరా పండుగను పురస్కరించుకుని టీఎస్ ఆర్టీసీ ప్రవేశ పెట్టిన లక్కీ డ్రాకు సంబంధించి సోమవారం హనుమకొండ జిల్లా బస్ స్టేషన్‌లో వరంగల్ ఆర్ఎం జాస్తి శ్రీలత సమక్షంలో విజేతలను ఎంపిక చేశారు. ప్రయాణికుల చేతుల మీదుగా డ్రా తీయించారు. గత ఏడాది అక్టోబర్ 18 నుంచి 30వ తేదీ వరకు బస్సుల్లో ప్రయాణించిన వారు తమ టికెట్లను బస్ స్టేషన్లలో ఏర్పాటు చేసిన ప్రత్యేక బాక్సుల్లో వేయగా.. డ్రా ద్వారా పురుషులు, మహిళలను వేర్వేరు విజేతలుగా ప్రకటించారు. మహిళల్లో ఎస్.విజయలక్ష్మి(ఫోన్ నంబర్ 6300714827), కె.శ్యామల(ఫోన్ నంబర్ 6281690313), సీహెచ్.జయ(ఫోన్ నంబర్ 9515929289), సోనియా(ఫోన్ నంబర్ 8639596508), కోరె అస్మిక(ఫోన్ నంబర్ 7673979045), పురుషుల్లో జె.రాజు(ఫోన్ నంబర్ 9652982257), మోర మార్కండేయ(ఫోన్ నంబర్ 9985032704), బి.వెంకన్న(ఫోన్ నంబర్ 9652713975), ఇ.అనిల్(ఫోన్ నంబర్ 9381417522), ఎస్.శ్రీనివాస్(ఫోన్ నంబర్ 9848768530) బహుమతులు గెలుచుకున్నారు. ఈ సందర్భంగా రీజినల్ మేనేజర్ జె.శ్రీలత మాట్లాడుతూ లక్కీ డ్రా వంటి కార్యక్రమాలు సంస్థకు, ప్రయాణికులకు మధ్య అనుబంధాన్ని మరింత బలోపేతం చేస్తాయని చెప్పారు. ఈ లక్కీ డ్రా విజేతలకు రూ.9,900 నగదు బహుమతి అందించనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో డిప్యూటీ రీజినల్ మేనేజర్ కేశరాజు భానుకిరణ్, వరంగల్–1 డిపో మేనేజర్ వంగాల మోహన్‌రావు, సూపర్‌వైజర్లు, ప్రయాణికులు పాల్గొన్నారు.

మార్కెట్‌లో మిర్చి బస్తాల అపహరణ



మాట్లాడుతున్న రైతులు జలేందర్, తిరుమలయ్య

కేసముద్రం: కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌లో తేజరకానికి చెందిన 6 మిర్చి బస్తాలు అపహరణకు గురయ్యాయి. ఈ ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. బాధిత రైతుల కథనం ప్రకారం.. నెల్లికుదురు మండలం ఆలేరుకు చెందిన రైతు పటేరు జలేందర్ తేజరకం మిర్చి 4 బస్తాలు, తాలు రకం మిర్చి 2 బస్తాలు, తారక తిరుమలయ్య అనే రైతు తేజారకం మిర్చి 2 బస్తాలు, తాలురకం మిర్చి 2 బస్తాలు విక్రయించేందుకు గత నెల 28వ తేదీన మార్కెట్‌కు తీసుకువచ్చారు. అయితే తేజరకం మిర్చికి గిట్టుబాటు ధర పడకపోవడంతో, తాలు రకం మిర్చినే ఆ ఇద్దరు రైతులు అమ్ముకున్నారు. కాగా, మిగిలిన 6 బస్తాలను(తేజారకం) ఆ ఇద్దరు రైతులు యార్డులోనే ఉంచి, అదే రోజు రాత్రి ఇంటికి వెళ్లారు. తిరిగి మరుసటి రోజు వచ్చి చూడగా మిర్చి బస్తాలు లేకపోవడంతో మార్కెట్ అధికారులు, పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సుమారు రూ.60వేల విలువైన 6 మిర్చి బస్తాలు అపహరణకు గురై 5 రోజులు కావొస్తున్నా తమ మిర్చి బస్తాలు ఎలా అపహరణకు గురయ్యాయో చెప్పడంలేదని సోమవారం విలేకరులకు చెప్పారు. తమకు ఎలాగైనా న్యాయం చేయాలంటూ ఆ ఇద్దరు రైతులు వేడుకుంటున్నారు. ఇదిలా ఉండగా ఆ రైతులు బస్తాలు ఉంచిన యార్డులో సీసీ కెమెరాలు పనిచేయడం లేదని మార్కెట్ అధికారులు చెబుతున్నారు.

ఐదో రోజు ఆదాయం రూ. 9.67 లక్షలు

- కొనసాగుతున్న మేడారం హుండీల లెక్కింపు



హుండీలలో లభించిన నగదు లెక్కిస్తున్న దేవాదాయశాఖ సిబ్బంది

హన్మకొండ కల్చరల్: హనుమకొండ లష్కర్‌బజార్‌లోని టీటీడీ కల్యాణ మండపంలో నిర్వహిస్తున్న మేడారం సమ్మక్క, సారలమ్మ జాతర హుండీ లెక్కింపు కొనసాగుతుంది. లెక్కింపులో భాగంగా ఐదో రోజు సోమవారం ఉదయం 76 ఐరన్‌హుండీలను లెక్కింపు జరపగా రూ. 93,67,000 ఆదాయం లభించింది. నాలుగు రోజుల నుంచి నిర్వహించిన లెక్కింపులో లభించిన ఆదాయం రూ. 10,32,03,000 కాగా ఐదో రోజు లెక్కింపులో రూ. 93,67,000 ఆదాయం లభించిందని మేడారం ఈఓ రాజేంద్రం తెలిపారు. ఐదు రోజుల నుంచి 481 హుండీలను లెక్కించగా రూ. 11, 25,70,000 ఆదాయం లభించిందని, దీనిని బ్యాంకులో జమ చేశామని తెలిపారు. జాతర ఏర్పాటు చేసిన మొత్తం హుండీలు 518తో పాటు తిరుగువారం 22 హుండీలు ఏర్పాటు చేశామని, దీంతో మొత్తం 540 హుండీలకు గాను సోమవారం వరకు 481 హుండీల లెక్కింపు పూర్తయిందని తెలిపారు. అలాగే, నాణెల లెక్కింపు చేపట్టలేదని, లభించిన బంగారం, వెండి ఆభరణాలను హుండీలో భద్రపర్చామని తెలిపారు. కార్యక్రమంలో దేవాదాయ ధర్మాదాయశాఖ రాష్ట్ర దేవాలయాల జ్యూలరీ వెరిఫికేషన్ ఆఫీసర్ కట్టా అంజనీదేవి, జిల్లా అసిస్టెంట్ కమిషనర్ రామల సునీత, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

హరిత, నీలి విప్లవాలతోనే అభివృద్ధి

- కొండా లక్ష్మణ్ ఉద్యాన యూనివర్సిటీ వీసీ డాక్టర్ నీరజ ప్రభాకర్



మాట్లాడుతున్న నీరజ ప్రభాకర్

ఎంజీఎం : పంచభూతాలతో ఏర్పడిన ప్రకృతిని ఆసరా చేసుకుని చేపట్టిన హరిత విప్లవం, నీలి విప్లవాలను అనుసంధానించి మరింత అభివృద్ధి సాధించవచ్చని కొండా లక్ష్మణ్ ఉద్యాన యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ నీరజ ప్రభాకర్ అన్నారు. సోమవారం వరంగల్‌లోని కాకతీయ మెడికల్ కళాశాల ఎన్ఆర్ఐ భవన్‌లో కొండా లక్ష్మణ్ ఉద్యాన యూనివర్సిటీ, జస్ట్ అగ్రికల్చర్ విద్యాసంస్థలు, ఎస్ఆర్ యూనివర్సిటీ సంయుక్తంగా ఏర్పాటు చేసిన 6వ ఇంటర్నేషనల్ ఇన్నోవేషన్స్ అడ్వాన్సెస్ ఫర్ సస్టైనబుల్ అగ్రికల్చర్ (హిటాస్–2024) కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించి ప్రసంగించారు. ఉద్యాన పంటల ప్రాధాన్యతను వివరిస్తూ నేటి ప్రపంచ అవసరాలను తీర్చడానికి ఆధునిక పద్ధతులను అవలంబిస్తూ సుస్థిర లక్ష్యాలను చేరుకోవాలన్నారు. ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం వల్ల నేటి తరంలో వ్యవసాయ రంగంలో వచ్చిన ఆధునిక శాస్త్ర, సాంకేతికత విస్తృతం అవుతుందని చెప్పారు. భవిష్యత్ తరాలకు మంచి ఆరోగ్యాన్ని అందించడానికి వ్యవసాయ రంగాన్ని పూర్తిస్థాయి ఉపాధి రంగంగా ప్రపంచ వ్యాప్తం చేయడానికి ఉద్యాన పంటల విస్తీర్ణాన్ని మరింత పెంచాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఈ సందర్భంగా ప్రతిభావంతులైన శాస్త్రవేత్తలు, ఉపాధ్యాయులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎస్ఆర్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఆర్.అర్చనరెడ్డి, స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ డీన్ డాక్టర్ భూపాల్‌రాజ్, డాక్టర్ బి.పి.ఎస్ బద్వాల్, జస్ట్ అగ్రి కల్చర్ విద్యా సొసైటీ వ్యవస్థాపకులు డాక్టర్ సుశీల హుడ, వ్యవసాయరంగ శాస్త్రవేత్తలు, పీజీ, పీహెచ్‌డీ, రీసెర్చ్ స్కాలర్స్ పాల్గొన్నారు.

కేయూ రిజిస్ట్రార్ దిగ్బంధం

- సమస్యలు పరిష్కరించాలని ఉద్యోగ సంఘాల డిమాండ్

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీలోని నాన్‌టీచింగ్ ఉద్యోగులు.. రిజిస్ట్రార్ మల్లారెడ్డిని దిగ్బంధించారు. తమకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేయూ ఎన్‌జీఓ , క్లాస్‌ఫోర్త్ ఎంప్లాయీస్ యూనియన్ల ఆధ్వర్యంలో సోమవారం రిజిస్ట్రార్ చాంబర్‌లో ఆందోళన చేపట్టారు. ప్రధానంగా 2013లో నియమాకమైన ఉద్యోగులకు పీఆర్‌సీ అమలుచేయాలని డిమాండ్ చేశారు. అలాగే, పలు విభాగాల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు అదనపు పని కాలానికి అదనపు రెమ్యూనరేషన్ ఇవ్వాలన్నారు. 30 ఏళ్లు పనిచేసిన టైం స్కేల్ ఉద్యోగుల్లో ఎవరైనా మృతి చెందినా, లేదా విరమణ పొందినా ఆయా కుటుంబాలకు రూ. 5 లక్షల నుంచి రూ 10 లక్షలకు పెంపుదల చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం రిజిస్ట్రార్ మల్లారెడ్డి మాట్లాడుతూ పీఆర్‌సీ అమలుపై ఆడిట్ అధికారులతో ఈనెల 5న సంప్రదింపులు జరిపి సమస్య పరిష్కరిస్తామన్నారు. కారుణ్య నియమకాలు, ఇతర సమస్యల పరిష్కారానికి తన వంతు కృషిచేస్తానన్నారు. అయితే ఎన్‌జీఓ సంఘం నాయకులు మాట్లాడుతూ నాన్‌టీచింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తామని వారం క్రితం హామీ ఇచ్చి మళ్లీ దాటవేసే యత్నం చేస్తున్నారని వాగ్వాదానికి దిగారు. సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గంటల వరకూ ఆయా ఉద్యోగసంఘాల బాధ్యులు.. తన చాంబర్ నుంచి వెళ్లకుండా రిజిస్ట్రార్‌ను దిగ్బంధించారు. చివరికి పలు సమస్యల పరిష్కారానికి సానుకూలంగా స్పందించడంతో ఉద్యోగులు వెళ్లిపోయారు. కార్యక్రమంలో కేయూ ఎన్‌జీఓ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వల్లాల తిరుపతి, ఎల్ యాదగిరి, క్లాస్‌ఫోర్త్ ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు అబ్దుల్‌షుకూర్, కొర్నేలు పాల్గొన్నారు.

మౌలిక సౌకర్యాలు కల్పించండి

- టౌన్ ప్లానింగ్ విభాగానికి అత్యధిక ఫిర్యాదులు
- ప్రజల నుంచి దరఖాస్తుల స్వీకరణ



గ్రీవెన్స్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు

వరంగల్ అర్బన్ : కాలనీల్లో మౌలిక సౌకర్యాలు కల్పించాలని గ్రీవెన్ సెల్‌లో ఫిర్యాదులు అందజేశారు.అత్యధికంగా టౌన్ ప్లానింగ్ విభాగానికి అనుమతి లేని నిర్మాణాలు, కబ్జాలపై ఫిర్యాదులు అందాయి. సోమవారం గ్రేటర్ వరంగల్ కౌన్సిల్ హాల్‌లో నిర్వహించిన గ్రీవెన్ సెల్‌లో ఇన్‌చార్జ్ అడిషనల్ కమిషనర్ అనిసుర్ రషీద్, వింగ్ అధికారులు ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. గ్రీవెన్ సెల్‌కు మొత్తం 76 ఫిర్యాదులు రాగా అందులో ఇంజనీరింగ్ సెక్షన్‌కు 16, హెల్త్, శానిటేషన్–6, ప్రాపర్టీ టాక్స్ (రెవెన్యూ)14, టౌన్ ప్లానింగ్ సెక్షన్–40 ఫిర్యాదులు సమర్పించారు. సిటీ ప్లానర్ వెంకన్న, ఎస్ఈ.కృష్ణరావు, సీఎంహెచ్ఓ రాజేష్, బయలాజిస్ట్ మాధవ రెడ్డి, డీఎఫ్ఓ శంకర్ లింగం, హెచ్ఓ రమేష్, డిప్యూటీ కమిషనర్లు రవీందర్, కృష్ణారెడ్డి, డీసీపీ ప్రకాశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొన్ని ఫిర్యాదుల వివరాలు..

- 61వ డివిజన్ ప్రశాంత్ నగర్‌లోని ఓస్కూల్‌కు సమీపంలో సీసీ రోడ్డు, డ్రెయినేజీ వ్యవస్థను ఏర్పాటు చేయాలని స్థానికులు ఫిర్యాదు చేశారు.
- 58వ డివిజన్ రాఘవేంద్ర నగర్ ఫేజ్–2 రోడ్డు నంబరు 2/ఎఫ్ విజయపాల్ రోడ్డులో సీసీ రోడ్డు ఏర్పాటు చేసి కల్వర్టు నిర్మించకపోవడం వల్ల రోడ్డు మూత పడిందని కాలనీవాసులు పేర్కొన్నారు.
- హనుమకొండ 52, 6వ డివిజన్లలో అనుమతి లేకుండా భవనాలు నిర్మిస్తున్నారని పలుమార్లు టీపీబీఓలకు ఫిర్యాదు చేసిన స్పందించడం లేదని డీవైఎఫ్ఐ నాయకుడు డి.తిరుపతి ఫిర్యాదు అందజేశారు.
- 50వ డివిజన్ న్యూ బృందవన్ కాలనీలో డ్రెయినేజీ లేక ఇళ్ల మధ్య మురుగునీరు నిలుస్తోందని స్థానికులు ఫిర్యాదు చేశారు.
- హనుమకొండ హయాగ్రీవాచారి ప్రహరీ సమీపంలోని ప్రైవేట్ ఆస్పత్రి నిర్వాహకులు నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణం చేస్తున్నారని టౌన్ ప్లానింగ్ అధికారులకు ఫిర్యాదు చేసిన స్పందించడం లేదని 31వ డివిజన్ కార్పొరేటర్ కోమల ఫిర్యాదు చేశారు.
- హనుమకొండ పద్మాక్షి కాలనీ రోడ్డులో ఓ వ్యక్తి వక్ఫ్‌బోర్డు భూమిని అక్రమించి భవనం నిర్మిస్తున్నాడని చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకుడు మిద్దెల బాబు వినతి పత్రం అందజేశారు.
- వరంగల్ రైల్వేస్టేషన్ వెనక పుప్పాల గుట్ట రోడ్డులో డ్రెయినేజీ నిర్మాణం చేపట్టాలని విఘ్నేశ్వర కాలనీ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు ఫిర్యాదు చేశారు.
- 1వ డివిజన్ పలివేల్పులకు సంబంధించిన 54–4–35 ఇంటి నంబరు తనకు కేటాయించారని, 2వ డివిజన్ గుండ్ల సింగారం నంబరు కేటాయించాలని జె.రమేష్‌బాబు విజ్ఞప్తి చేశారు.
- వరంగల్ విలీన గ్రామం బొల్లికుంట వాగ్దేవి కాలేజీకి సమీపంలోని ఇళ్లల్లో డ్రెయినేజీలు నిర్మించాలని కాలనీవాసులు విన్నవించారు.
- హనుమకొండ జవహర్‌కాలనీ రోడ్డు నంబరు –1లో రోడ్డు అక్రమణపై చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరారు.
- 3వ డివిజన్ పైడిపల్లి బిల్డింగ్ పర్మిషన్ కోసం రూ. 98వేలు చెల్లించానని, సాంకేతిక కారణాలతో తిరస్కరించారని, మళ్లీ దరఖాస్తు చేసుకున్నానని అనుమతి ఇవ్వాలని టి.రాజా ఉపేందర్ విన్నవించారు.
- హనుమకొండ అంబేడ్కర్ నగర్‌లో వాటర్ ట్యాంక్ నిర్మాణానికి కేటాయించిన స్థలాన్ని కొందరు ఆక్రమించారని, అదే స్థలంలో కమ్యూనిటీ హాల్ నిర్మించాలని కాలనీవాసులు కోరారు.
- దర్గా కాజీపేటలో రూపాయి నల్లా కనెక్షన్ కోసం దరఖాస్తు చేసుకొని ఏళ్లు గడిచిన మంజూరు ఇవ్వడం లేదని, బిల్లు మాత్రం వస్తోందని ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని మోడెం ఎల్లమ్మ విజ్ఞప్తి చేశారు.
- కరీమాబాద్‌లో సెల్ టవర్ నిర్మాణ అనుమతులు రద్దు చేయాలని కాలనీవాసులు ఫిర్యాదు చేశారు.
- వరంగల్ విశ్వకర్మ వీధిలో బల్దియా రోడ్డుపై ర్యాంపు నిర్మించారని తొలగించాలని వినతి పత్రాన్ని అందజేసినట్లు రామోజు జయసాగర్ ఫిర్యాదు చేశారు.

చోరీకి పాల్పడిన మహిళలు అరెస్టు

మల్కన్‌గిరి: ఒడిశాలోని మల్కన్‌గిరి జిల్లా కలిమెల సమితి కేంద్రంలో ఉన్న పంచాయతీ కార్యాలయానికి చెందిన గోదాంలో చోరీకి పాల్పడిన తెలంగాణకు చెందిన ఏడుగురు మహిళలను పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. తెలంగాణ నుంచి వచ్చిన మహిళలు కలిమెలలో పగటి సమయంలో పాత్రలు, తదితర సామగ్రి అమ్ముకుంటూ వేర్వేరు స్థావరాల్లో తలదాచుకునేవారు. ఈ నేపథ్యంలో ఆదివారం సెలవు కావడంతో సిబ్బంది ఎవరూ ఉండరని గమనించి స్థానిక పంచాయతీ కార్యాలయానికి చెందిన గోదాంలో సిలిండర్లు, పైపుల చోరీకి యత్నించారు. అయితే ఓ స్థానిక మహిళ చూసి వెంటనే అధికారికి ఫోన్‌లో సమాచారం ఇచ్చింది. దీంతో ఆ అధికారి సుకుమార్ ప్రధాన్.. పోలీసులకు సమాచారమిచ్చారు. వెంటనే కలిమెల ఐఐసీ చంద్రకాంత్ తండి తన సిబ్బందితో వెళ్లి చోరీకి పాల్పడుతున్న మహిళలను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి చోరీ చేసిన సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. అరెస్ట్ అయిన వారిలో ఉమ్మడి వరంగల్ జిల్లా ములుగు మండలం బండారుపల్లికి చెందిన దాసరి నాయమ్మ, కరీంనగర్ జిల్లా సిరిపురం పీఎస్ పరిధి దుబ్బపల్లికి చెందిన దాసరి రెబికా, కందల సుభ్రత, కొత్తగూడెం జిల్లా చీరాల పీఎస్ పరిధి చీరాలకు చెందిన కందల మహేశమ్మ, కందల తిరుపతమ్మ, మంచిర్యాల జిల్లా ఉట్కూరు పీఎస్ పరిధి లక్ష్మయిపేటకు చెందిన వెంకటమ్మ, ఉమ్మడి వరంగల్ జిల్లా ములుగు పీఎస్ పరిధి జనగాపల్లికి చెందిన వనం రేణుక ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. వీరిపై కేసు నమోదు చేసి సోమవారం కోర్టులో హాజరుపరిచారు.

రైలు నుంచి జారిపడి యువకుడి మృతి

కాశిబుగ్గ: రైలు నుంచి జారిపడి ఓ గుర్తు తెలియని యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన సోమవారం చింతలపల్లి– వరంగల్ రైల్వే స్టేషన్ల మధ్య చింతల్ ఫ్లై ఓవర్ బ్రిడ్జి సమీపంలో చోటుచేసుకుంది. జీఆర్పీ ఎస్సై ఐలయ్య కథనం ప్రకారం.. మృతుడు 20 నుంచి 25 సంవత్సరాల మధ్య వయసు ఉండి 5.4 ఎత్తు, చామన ఛాయ రంగు కలిగి ఉన్నాడు. బ్లాక్ కలర్ పాయింట్, బ్లాక్ అండ్ బ్లూ డబుల్ చెక్స్ డిజైన్ గల ఫుల్ షర్ట్ ధరించి ఉన్నాడు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించకపోవడంతో మృతదేహాన్ని ఎంజీఎం మార్చురీలో భద్రపరిచారు. మృతుడి వివరాలు తెలిస్తే 9959425483, 8712658585 నంబర్లలో సంప్రదించాలని ఎస్సై సూచించారు.

రోడ్డు ప్రమాదంలో పలువురికి గాయాలు

మడికొండ: రోడ్డు ప్రమాదంలో పలువురికి గాయాలయ్యాయి. ఈ ఘటన సోమవారం మడికొండ ఔటర్ రింగ్ రోడ్డుపై జరిగింది. స్థానికుల కథనం ప్రకారం ధర్మసాగర్ మండలం తాటికాయల గ్రామానికి చెందిన కర్ణకంటి రాజు తన బావతో కలిసి ద్విచక్రవాహనంపై వరంగల్ వైపునకు వస్తున్నాడు. ఈ క్రమంలో హైదరాబాద్ కొత్తపేటకు చెందిన మారెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి కారులో హైదరాబాద్ నుంచి వరంగల్ వెళ్తున్నాడు. ఔటర్ రింగ్ రోడ్డు టేకులగూడెం మామిడి తోట వద్దకు రాగానే కారు వెనుక నుంచి ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. అనంతరం కారు పల్టీ కొట్టింది. ఈ ఘటనలో కారులో ఉన్న విష్ణువర్ధన్, ద్విచక్రవాహనంపై ఉన్న ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే క్షతగాత్రులను 108లో ఎంజీఎం తరలించినట్లు తెలిపారు. దీనిపై పోలీసులను వివరాలు కోరగా ఫిర్యాదు అందలేదని తెలిపారు.